క్లుప్తంగా

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపిక జాబితా

మునగపాక: మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో చేరే విద్యార్థుల ఎంపిక జాబితా అందుబాటులో ఉంచామని ప్రిన్సిపాల్ పీపీఎస్ శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తేదీ నుంచి ఎంపికైన విద్యార్థులు స్కూల్‌కు రావాల్సి ఉంటుందన్నారు. స్టూడెంట్, పేరెంట్ ఆధార్‌కార్డులు, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, టీసీ, ఐడీ, 2 పాస్‌పోర్టు ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట



మొబైల్ మెడికల్ అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నట్టు ఎమ్మెల్యే విజయకుమార్ తెలిపారు. మునగపాకలో ఆయన సోమవారం మొబైల్ మెడికల్ అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబులెన్స్ ద్వారా మారుమూల ప్రాంత ప్రజలకు సైతం వైద్యం అందించేలా ఏషియన్ పెయింట్స్ ముందుకొచ్చిందన్నారు. ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు, దొడ్డి శ్రీనివాసరావు, ఏవీ సత్యనారాయణ, దాడి ముసిలినాయుడు, మళ్ల కాలేశ్వరరావు, ఆడారి శ్రీకాంత్, మొల్లేటి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక దోహదపడుతుందని ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ హాలులో ఏర్పాటు చేసిన ప్రజా వేదిక కార్యక్రమంలో సోమవారం ఆమె అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలే కాకుండా వ్యక్తిగత సమస్యలకు సంబంధించి కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అధికారులు అందుబాటులో ఉంటారని, సమస్య సత్వర పరిష్కారం కాగలదన్నారు. ఈవోఆర్డీ సోమరాజు, మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, మండల ఇంజినీరింగ్ అధికారి గులామ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


పచ్చిరొట్ట పంటలతో నేల సంరక్షణ



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్

పాయకరావుపేట: మండలంలోని అరట్లకోట, గుంటపల్లి, ఒడ్డిమెట్ట గ్రామాల్లో సోమవారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. సాగులో సమగ్ర యాజమాన్య చర్యలు పాటించడం ద్వారా నాణ్యమైన దిగుబడి సాధించవచ్చునని శాస్త్రవేత్తలు, అధికారులు తెలిపారు. వాణిజ్య పంటల పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ కొబ్బరి వంటి దీర్ఘకాలిక తోటలలో విత్తన ఎంపిక చాలా కీలకమన్నారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శివ మాట్లాడుతూ కొబ్బరిలో కొమ్ము పురుగు, ఎర్రముక్కు పురుగు, తెల్ల దోమ నివారణ చర్యలు వివరించారు. వరి పంటకు ముందుగా నవధాన్యాల పచ్చిరొట్ట సాగు చేసి, నేలలో కలియ దున్నడం ద్వారా నేల సారవంతం అవుతుందని, రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుందని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి పి.ఆదినారాయణ మాట్లాడుతూ మనకున్న భూమిలో కనీసం ఒక ఎకరంలోనైనా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద తూము వెంకటరమణ, కట్టా శ్రీను, తుమ్మల గణేష్, పి.లక్ష్మణరావు, అభ్యుదయ రైతులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది రమ్య, వందన, శ్రవణ్, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

మునగపాక: వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. రూ.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వెంకన్న ఆలయానికి భక్తులు తనవంతు సాయం అందించాలన్నారు. సోమవారం మునగపాకకు చెందిన ఏవీ సత్యనారాయణ–సరోజిని దంపతుల కుమారులు శ్రీకాంత్, హరీష్ రూ.50 వేల నగదును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మునగపాక బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న ఆలయ అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయని, భక్తుల సహకారం ఎంతైనా అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల జగ్గారావు, దాడి ముసిలినాయుడు, పెంటకోట ఉమేష్, పాలిమేర కృష్ణ, వెలగా శ్రీనివాసరావు, ఆడారి గణేష్, బొడ్డేడ రామునాయుడు, కేవీఎస్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

కూలి పనులు మానుకుని పడిగాపులు



కోటవురట్ల మండలం లింగాపురం డిపో వద్ద సరుకుల కోసం పడిగాపులు



నక్కపల్లి మండలం రాజయ్యపేట డిపో వద్ద సరుకుల కోసం లబ్ధిదారుల పాట్లు

రేషన్ బియ్యం కోసం రెండో రోజూ అవే కష్టాలు

శివారు గ్రామాల ప్రజలకు నానా అవస్థలు



ఎస్.రాయవరం మండలం కొరుప్రోలులో రేషన్ డిపో వద్ద పడుగాపులు కాస్తున్న లబ్ధిదారులు

నక్కపల్లి: రెండో రోజు కూడా అవే కష్టాలు. నిత్యావసర సరకుల కోసం రేషన్ డిపోల వద్ద లబ్ధిదారులు పడిగాపులు కాశారు. గత నెల వరకు ఇంటింటికి వచ్చే ఎండీయూ వాహనాలను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం నిర్వాకం కారణంగా రేషన్ సరకుల కోసం కూలి పనులు మానుకుని డిపోల వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. మరో వైపు డిపోల వద్ద మెషిన్‌లు మొరాయిస్తున్నాయి. నెట్‌వర్క్ సరిగా లేకపోవడంతో బయోమెట్రిక్ తీసుకోవడంలో ఇబ్బంది ఎదురవుతోంది. దీంతో సరకుల కోసం వెళ్లిన కార్డుదారులంతా గంటల తరబడి డిపోల వద్ద మండుటెండలో క్యూలైన్లలో పడిగాపులు పడాల్సి వస్తోంది. సరకుల అందే వరకు ఎన్ని రోజులైనా తామే ఉసూరుమంటూ డిపోల వద్దకు వెళ్లాల్సి రావడంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలి పని మానుకుని ఒక పూటంతా డిపో వద్ద వేచి ఉండాల్సి వస్తోంది. 20 కిలోల బియ్యం బస్తాను నెత్తిన పెట్టుకుని అర కిలోమీటరు దూరం నడవాల్సి వస్తోందంటూ అవ్వాతాతలు వాపోతున్నారు. మంచాన పడ్డవారి తరపున ఎవరైనా వెళ్తే సరకులు ఇవ్వడం లేదు. తర్వాత ఎప్పుడో రద్దీ తగ్గిన తర్వాత సరకులు వారి వద్దకు వెళ్లి ఇస్తామని డీలర్లు చెబుతున్నారు. అప్పటి వరకు వీరంతా పస్తులుండాల్సిందేనా అంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

శివారు గ్రామాల పరిస్థితి దయనీయం

శివారు గ్రామాల ప్రజలకు సరకులు తెచ్చుకోవడం చాలా ఇబ్బందిగా ఉంది. ఉపమాక పంచాయతీలో సుమారు ఏడు శివారు గ్రామాలున్నాయి. అమలాపురం పంచాయతీలో రెండు శివారు గ్రామాలు, చినదొడ్డిగల్లు పంచాయతీలో రెండు, గొడిచర్ల పంచాయతీలో రెండు, రేబాక పంచాయతీలో రెండు, తీనార్ల పంచాయతీలో రెండు, ఇలా ప్రతి పంచాయతీలో శివారు గ్రామాలున్నాయి. ప్రధాన గ్రామానికి ఈ శివారు గ్రామాల రెండు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ఈ శివారు గ్రామాల వారు ప్రధాన గ్రామంలో ఉన్న డిపో వద్దకు వెళ్లి సరకులు తెచ్చుకోవడానికి నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

5 కేజీల బియ్యం కోసం 3 కి.మీ దూరం ప్రయాణం



నా ఒక్క దానికే రేషన్ కార్డు ఉంది. ఐదు కేజీల బియ్యం ఇత్తారు. కిందటి నెల వరకు వ్యాన్‌లో తెచ్చి ఇంటికాడ బియ్యం ఇచ్చేవోరు. ఈ నెల నుంచి పాటిమీద గేమానికి ఎల్లి బియ్యం తెచ్చుకోవాలంట. ఐదు కేజీల బియ్యం కోసం మూడు కిలోమీటర్లు నడిచి వెల్లాలా. మేమేం పాపం చేసాం. ఇలా ఏడిపిత్తన్నారు. ముసల దాన్ని ఇంట్లో పని చేసుకోడమే కట్టంగా ఉంది. అంత దూరం ఎల్లి బియ్యం తెచ్చుకోవలంట. మధ్యలోపేణం పోతే ఏటి పరిస్థితి.

– సూరాకాసుల చినతల్లి, మూలపర, అమలాపురం శివారు

గతంలో ఇంటికి తెచ్చి ఇచ్చేవారు..



మాది అమలాపురం శివారు మూలపర గ్రామం. మాకు సంబంధించిన రేషన్ డిపో పాటిమీద గ్రామంలో ఉంది. మేము నివసిస్తున్న గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. గతంలో అయితే వలంటీర్లు, డిపో డీలరు కలిసి ప్రత్యేకంగా వ్యాన్‌లో తెచ్చి సరకులు ఇచ్చేసి వెళ్లేవారు. మేము సరకుల కోసం ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం ఉండేది కాదు. మా ఇంటి దగ్గరకే సరకులు వచ్చేవి. ఈ నెల నుంచి పాటిమీద గ్రామానికి వెళ్లి తెచ్చుకోమంటున్నారు. మండు టెండలో మూడు కిలోమీటర్లు దూరం ఎలా వెళ్తాం. ఇదెక్కడి అన్యాయం. ప్రభుత్వం ఇంత దారుణంగా వ్యవహరిస్తుందని అనుకోలేదు. ప్రభుత్వానికి ఇది తగదు.

– బొమ్మిడాల అర్జలక్ష్మి, మూలపర గ్రామం

'సాయిమెరైన్' వ్యర్థాలతో దుర్గంధంపై ఆందోళన



పరిశ్రమ వ్యర్థాలు ఆపాలంటూ నినాదాలు చేస్తున్న బాధిత గ్రామస్తులు

ఎస్.రాయవరం: గుడివాడ రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేసిన సాయి మెరైన్ పరిశ్రమ పరిసర గ్రామాలను మురుగుమయంగా మారుస్తోందని గుడివాడ గ్రామస్తులు సోమవారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. సుమారు 300 మంది మహిళలో కలిసి సర్పంచ్ దూళి శ్రీనుబాబు పరిశ్రమ మెయిన్ గేటు వద్ద టెంట్ వేసి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆందోళన చేశారు. వైఎస్సార్ సీపీ, సీపీఎం నాయకుల సహకారంతో చేపట్టిన ఈ ధర్నాకు పరిసర గ్రామాల ప్రజలు కూడా మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనుబాబు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ 2018లో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు అయిన ఈ పరిశ్రమ వ్యర్థాల కారణంగా గుడివాడ గ్రామంతో పాటు పరిసర గ్రామాలు మురికి కూపంలా మారాయన్నారు. పరిశ్రమ వ్యర్థాలు నేరుగా వరహానది కాలువ అయిన పంట కాలువలోకి విడుదల చేయడంతో ఇటు తాగునీరు, అటు సాగునీరు కలుషితం అవుతోందన్నారు. పశువులు కూడా రోగాల బారిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులకు 80 శాతం ఉపాధి కల్పిస్తామని చెప్పి, ఒడిశా, తదితర రాష్ట్రాల నుంచి కార్మికులకు తెచ్చుకుని పనులు చేయిస్తున్నారన్నారు. అలా తీసుకొచ్చిన కార్మికులకు కనీస వసతులు కల్పించకుండా ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. ఇటీవల 19 ఏళ్ల కార్మికుడు యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల మృతి చెందితే రూ.2.5 లక్షల లెక్కగట్టి ఇచ్చారని, ఇలా వెలుగులోకి రాని ఘోరాలు జరుగుతున్నాయని వారు ఆరోపించారు. పరిశ్రమ వ్యర్థాలు శుభ్రం చేసి తరలించేందుకు కోటి రూపాయలు పెట్టి ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసి, దానిని వాడకుండా వ్యర్థాలు నేరుగా కాలువలోకి విడుదల చేయడం దారుణమన్నారు. పరిశ్రమ యాజమాన్యం స్పందించకుంటే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని సర్పంచ్ హెచ్చరించారు. హోంమంత్రి క్యాంపు కార్యాలయానికి 6 కిలో మీటర్లు దూరంలో ఉన్న పరిశ్రమ వల్ల గుడివాడ, లక్ష్మీపతిరాజుపేట, కొత్తపోలవరం, రేవు పోలవరం, కొత్త రేవుపోలవరం, పెదఉప్పలం తదితర గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నా కనీసం స్పందించక పోవడం దారుణమని సీపీఎం అప్పలరాజు విమర్శించారు. వచ్చే సోమవారం వరకు సమయం ఇవ్వాలని పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు కోరారు. పోలీసులు కూడా నచ్చజెప్పడంతో సాయంత్రం ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నల్లపరాజు వెంకటరాజు, బొట్టా రాంబాబు, పొలుమూర్తి అప్పలరాజు, నల్లపరాజు శ్రీపతిరాజు, దారబోయిన నానాజీ, పత్సమట్ల జోగిరాజు, దూళి సత్యవతి, సీపీఎం మండల కార్యవర్గ సభ్యుడు ఎం.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా రీసర్వే



తిమ్మాపురం రికార్డులు పరిశీలిస్తున్న మండల సర్వేయర్ మూర్తి

ఎస్.రాయవరం: మండలంలో శరవేగంగా రీసర్వే పనులు జరుగుతున్నట్టు మండల సర్వేయర్ మూర్తి చెప్పారు. తిమ్మాపురం గ్రామంలో సర్వే పనుల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను పరిశీలించి, వేగంగా నివేదికలు సిద్ధం చేయాలని సచివాలయ సర్వేయర్‌కి సూచించారు. ఎస్.రాయవరం మండలంలో 22 రెవెన్యూ గ్రామాలకు గత ప్రభుత్వంలో 7 గ్రామాల్లో రీసర్వే పనులు పూర్తయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కర్రివాపాలెం గ్రామం సర్వే పనులు పూర్తి కాగా, ప్రస్తుతం వమ్మవరం, సర్వసిద్ధి గ్రామాల్లో రీసర్వే పనులు చేస్తున్నామని మూర్తి చెప్పారు.

నేడు పూడిమడకలో యోగాపై అవగాహన

అచ్యుతాపురం రూరల్ : పూడిమడకలో మంగళవారం మత్స్యకారులకు యోగాపై అవగాహన కల్పించనున్నట్లు ఎఫ్‌డీవో రవితేజ తెలిపారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సోమవారం పరిసరాలను శుభ్రం చేశారు. పేరుకుపోయిన చెత్తను తొలగించి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. అధిక సంఖ్యలో యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలని ఎఫ్‌డీవో కోరారు.

6న చిన్నారులకు అక్షరాభ్యాసం

అనకాపల్లి: మండలంలో బట్టపూడి పంచాయతీ నాయుడుపేటలో హరహర మహాదేవ శంభో శంకర ఆలయంలో ఈ నెల 6న పౌర్ణమి సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి శివ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆంజనేయస్వామి గుడి వెనుక కొండపైన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధి బకాయిలు తక్షణం చెల్లించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు రొంగలి రాము

అచ్యుతాపురం రూరల్ : వారాల తరబడి ఉపాధి హామీ కార్మికులకు బకాయి పడిన వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. సోమవారం మండలంలో మళ్ళవరం, జగన్నాథపురం గ్రామాల్లో ఉపాధి హామీ కార్మికులతో ఆందోళన చేశారు. 8 వారాల వేతనాలు వెంటనే చెల్లించాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికులు అర్ధాకలితో జీవనం సాగిస్తున్నారన్నారు. కార్మికులకు సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలన్నారు. రోజుకు రూ.600 వేతనం చెల్లించాలన్నారు. కార్మికుల రక్షణకు, సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉద్యానవన సాగు లాభదాయకం

కశింకోట: ఉద్యానవన సాగు లాభదాయకంగా ఉంటుందని, వీటిని చేపట్టడం పట్ల రైతులు దృష్టి సారించాలని ఉద్యానవన విస్తరణ అధికారి ప్రవీణ తెలిపారు. మండలంలోని జి. భీమవరంలో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం, జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు పంటల సాగుపై సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి, జీడి, తదితర పండ్ల తోటలు, కొబ్బరి, కూరగాయలు వగైరా సాగు చేపట్టాలన్నారు. వీటి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించితే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయన్నారు. వ్యవసాయ శాఖ అనకాపల్లి విభాగం సహాయ సంచాలకుడు ఎం.రామారావు మాట్లాడుతూ సాగులో సేంద్రియ ఎరువుల వాడకం పట్ల రైతులు దృష్టి సారించాలన్నారు. జిల్లా రిసోర్స్ కేంద్రం ఏడీఏ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఖరీఫ్ వరి సాగులో మెలకువలను వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం భూసార శాస్త్రవేత్త బి.శ్రీహరిరావు సహజ ఎరువుల వాడకం ఆవశ్యకతను వివరించారు. పశువైద్య శాస్త్రవేత్త విజయ రాజ్ఞి పశువుల సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. వ్యవసాయ అధికారి ఎం. స్వప్న ఖరీఫ్ వరి సాగుకు ముందు పచ్చిరొట్ట ఎరువులు జల్లుకోవాలన్నారు. సాగు చేసి ఎదిగిన తర్వాత వాటిని దమ్ములో కలియ దున్నుకుంటే భూమి సారవంతం కావడంతో పాటు పంట దిగుబడి పెరుగుతుందన్నారు.

'వెన్నుపోటు దినం' విజయవంతం చేయండి



వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ పిలుపు

మునగపాక: ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీ నిర్వహించనున్న వెన్నుపోటు దినం విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం మునగపాకలో పార్టీ నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి రానున్న రోజుల్లో తగిన గుణపాఠం తప్పదన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మోసం చేసి అధికారంలోకి వచ్చారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరిందన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న వ్యక్తిగా జగన్‌మోహన్ రెడ్డి పేరుగాంచారన్నారు. పార్టీ ఇచ్చిన పిలుపులో భాగంగా 4వ తేదీన ర్యాలీతో పాటు అధికారులకు వినతి అందించాలన్నారు. సర్పంచ్‌లు కాండ్రేగుల నూకరాజు, చదరం నాయుడు, సుందరపు తాతాజీ, ఆడారి కృష్ణవేణి త్రిమూర్తులు, బొడ్డేడ శ్రీనివాసరావు, భీశెట్టి గంగప్పలనాయుడు, ఎంపీటీసీలు మద్దాల వీరునాయుడు, మొల్లేటి కృష్ణవేణి నారాయణరావు, పార్టీ నేతలు నరాలశెట్టి సూర్యనారాయణ, దొడ్డి బాలాజీ, షేక్ ఇస్మాయిల్, దాసరి అప్పారావు, పిన్నమరాజు రవీంద్రరాజు, పొలమరశెట్టి నాయుడు అప్పలనాయుడు, రాపేటి పరమేష్, అరిగా శ్రీనివాసరావు, పెంటకోట హరేరామ, పెంటకోట అప్పలనాయుడు, గుంట్ల అప్పారావు, నమ్మి చిరంజీవి, రావి బుజ్జి, దొడ్డి బుజ్జి, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం' నిరసన ర్యాలీ అనుమతి కోసం వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పాయకరావుపేట: వైఎస్సార్‌సీపీ బుధవారం తలపెట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని వైఎస్సార్ సీపీ నాయకులు తహసీల్దార్ గారా ఆనందరావుకు సోమవారం వినతి పత్రం అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామన్న సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజల్ని వెన్నుపోటు పొడుస్తుందని, అందుకే 4న నిరసన ర్యాలీ చేపడుతున్నట్లు తహసీల్దార్‌కు వివరించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి మహేష్ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ లంక సూరిబాబు, జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ధనిశెట్టి మాధవి తిరుమల్లేశ్వరరావు, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, పంచాయతీ వార్డు సభ్యులు కొప్పిశెట్టి మోహన్, జగతా భారతి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు కేశనకుర్తి సత్తిబాబు, పోసిన వీరబాబు, బి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు

- 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- ఒక్కసారిగా మారిన వాతావరణం
- వేడిగాలులతో జనం ఉక్కిరిబిక్కిరి



ఎండ నుంచి ఉపశమనం పొందడానికి కొబ్బరి నీరు తాగుతున్న వృద్ధుడు



ఎండ తీవ్రతతో జనసంచారం లేని యలమంచిలి ప్రధాన రహదారి



భానుడు ప్రతాపం నుంచి రక్షణకు ఇలా..



నిర్మానుష్యంగా ఉన్న కోటవురట్ల మెయిన్‌రోడ్డు

యలమంచిలి రూరల్: ఇటీవల ఓ మోస్తరు వర్షాలు, చిరు జల్లులతో చల్లబడిన వాతావరణం గత రెండ్రోజులుగా మారింది. సూరీడు సుర్రుమంటుండడం, సోమవారం వీచిన వేడి గాలులతో పట్టణ ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. యలమంచిలి పట్టణంలో సోమవారం 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇటీవల మూడు వారాల్లో ఇదే ఎక్కువ ఉష్ణోగ్రత కావడంతో సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు, రద్దీగా ఉండే రైల్వేస్టేషన్ రోడ్డు, గాంధీనగరం, కోర్టుపేట, తులసీనగర్ దిమిలి రోడ్డు, సైతారుపేట రహదారుల్లో జనసంచారం పలుచబడింది. భానుడి సెగల నుంచి ఉపశమనం కోసం జనం శీతల పానీయాలు, పండ్ల రసాలు సేవించారు. ఎండ నుంచి రక్షణ పొందడానికి పలువురు గొడుగులు, చీర కొంగులు, చున్నీలు వేసుకుని వెళ్లడం కనిపించింది. పట్టణంలో జన సంచారానికి సరిపడా చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దాహార్తి తీరే దారి కనిపించక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దాహం తీర్చుకోవడానికి వాటర్ బాటిళ్లు కొనుక్కోవాల్సి వచ్చిందని పలువురు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వాపోయారు. మరోవైపు మండే ఎండల కారణంగా వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని, ఎండ దెబ్బకు గురైన వారిలో ఆకస్మికంగా వాంతులు, విరేచనాలతో పాటు తీవ్రమైన కడుపునొప్పి వస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే తగు జాగ్రత్తలు తీసుకుని, సమీపంలో వైద్యుడ్ని సంప్రదించాలని సూచిస్తున్నారు. వడదెబ్బ బారిన పడకుండా ఎక్కువగా మంచినీరు, కొబ్బరినీరు, ఓఆర్ఎస్ ద్రావణం, ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్‌తో పాటు నీటిశాతం అధికంగా ఉండే పుచ్చకాయ తీసుకోవాలని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ఠారెత్తించిన సూరీడు..

కోటవురట్ల: సూరీడు మళ్లీ రెచ్చిపోయాడు. వారం రోజుల పాటు వర్షాలు ఆహ్లాదాన్ని పంచగా ఉపశమనం పొందారు. హమ్మయ్య రోహిణీ కార్తెలో వర్షాలు కాపాడాయని అంతా సంతోషించారు. అయితే భానుడు మళ్లీ ప్రతాపం చూపించడం ప్రారంభించాడు. రెండు రోజులుగా భగభగ మండిపోయి జనాలను హడలెత్తించాడు. ఉదయం 8 గంటల నుంచి తీవ్ర వడగాలులు వీచాయి. ఎండ తీవ్రతకు రహదారులు ఖాళీ అయిపోయాయి. 11 గంటలకే నిర్మానుష్యంగా మారిపోయాయి. ఈ రెండు రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు 39 డిగ్రీలు వరకు నమోదైంది. దాంతో జనం ఎండ వేడికి ఉక్కిరిబిక్కిరయ్యారు.

కుటుంబ కలహాలతోనే సూరిబాబు ఆత్మహత్య

మునగపాక: మండలంలోని కుమారపురంలో కుటుంబ కలహాల నేపథ్యంలోనే పల్లెల సూరిబాబు ఆత్మహత్యకు పాల్పడినట్లు తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు తెలిపారు. సోమవారం కుమారపురంలో సూరిబాబు మృతిపై ఆర్ఐ పడాల్ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. సూరిబాబు పేరిట ఎటువంటి భూమి లేదని నిర్ధారించినట్లు ఆయన తెలిపారు. తరచూ కుటుంబంలో వివాదాలు జరుగుతుండేవని, దీనిలో భాగంగా పురుగు మందు తాగి సూరిబాబు ఆత్మహత్యకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు.

మోసపూరిత హామీలతో ప్రజలకు వెన్నుపోటు



కిల్లాడ శ్రీనివాసరావు

కోటవురట్ల: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 4న తలపెట్టిన వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చిందని, అందులో ప్రధానమైన సూపర్ సిక్స్ హామీలను ఏడాది పాలన పూర్తయినా అమలు చేయలేకపోయిందని విమర్శించారు. మోసపూరిత హామీలతో ప్రజలను కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని, ప్రజల తరపున పోరాడేందుకు వైఎస్సార్ సీపీ వెన్నుపోటు దినాన్ని చేపడుతోందని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో జరిగే ఈ కార్యక్రమాన్ని పాయకరావుపేటలోని దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహం వద్ద ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నట్టు తెలిపారు. నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల నుంచి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.